సాక్షి నంద్యాల

మంగళవారం : 20 : ఫిబ్రవరి : 2024



సెబ్ ఉక్కుపాదం

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని సెబ్ సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్ పేర్కొన్నారు. భారీగా కర్ణాటక మద్యాన్ని పట్టుకున్న సిబ్బందిని అభినందించారు.

8లో▸



జీవన వికాసం

రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో ప్రజల జీవన విధానంలో భారీ మార్పులు వచ్చాయి. చాలా మంది పేదరికం నుంచి బయట పడ్డారు.

8లో▸



ఆలయ భూములు పరిరక్షించండి

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులపై ఉందని ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ అన్నారు.

8లో▸

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన ఆళ్లగడ్డ డీఎస్పీ



ఎస్పీకి బొకే అందజేస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

బొమ్మలసత్రం: ఆళ్లగడ్డ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన షేక్ షర్ఫుద్దీన్ సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లా ఎస్పీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న షర్ఫుద్దీన్‌ను సాధారణ బదిలీలో భాగంగా ఉన్నతాధికారులు ఆళ్లగడ్డ డీఎస్పీగా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఆళ్లగడ్డలో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా ఎస్పీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

కుడా మాస్టర్ ప్లాన్ విడుదల

నంద్యాల(సెంట్రల్): కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)కి సంబంధించి ఫేజ్‌–1 కింద సాధారణ పట్టణ ప్రణాళిక పథకం (మాస్టర్ ప్లాన్)ను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ప్రధానంగా 5 పట్టణ స్థానిక సంస్థలైన కర్నూలు కార్పొరేషన్, నంద్యాల, డోన్ మున్సిపాలిటీలు, బేతంచెర్ల, గూడూరు నగర పంచాయతీలకు ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ నిబంధనలు–2017 ప్రకారం సవరించిన తాజా భవన, లేఅవుట్ మార్గదర్శకాలు అమలులోకి రానున్నాయి. తాజా మాస్టర్ ప్లాన్ నిబంధనలు నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరు నెలల కాలం వరకు వర్తించనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆశాజనకంగా మిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. సోమవారం సూపర్‌–10, సూపర్‌–5 రకాలు అమ్మకానికి వచ్చాయి. సూపర్‌–10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.17,500, మధ్యస్థ ధర రూ.16,200, కనిష్ట ధర రూ.14,300గా నమోదైంది. ఇదే రకం తాలు కాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.7,700, మధ్యస్థ ధర రూ.6,800, కనిష్ట ధర రూ.6వేలుగా పలికింది. ఇక సూపర్‌–5 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.19,200, మధ్యస్థ ధర రూ.18వేలు, కనిష్ట ధర రూ.14వేలుగా నమోదైనట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

నేటితో ముగియనున్న ఇంటర్ ప్రాక్టికల్స్

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నేటి(మంగళవారం)తో ముగియనున్నాయి. ఈ నెల 5 నుంచి వొకేషనల్, ఈ నెల 11 నుంచి జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు మొదలయ్యాయి. సోమవారం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలకు ఉదయం 1,313 మందికిగాను 1,303 మంది హాజరుకాగా 10 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలకు 1,123 మందికిగాను 1,116 మంది హాజరుకాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. చివరి రోజున 9 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి.

క్వింటా వాము రూ.26,666

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం వాము దాదాపు 2వేల క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.527, గరిష్ట ధర రూ.26,666, సగటు ధర రూ.18,300 పలికింది. కందులు మార్కెట్‌కు 534 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.1,106, గరిష్ట ధర రూ.9,901, సగటు ధర రూ.9896 లభించింది.

పేదింట కల్యాణ కాంతులు

- పేదింటి ఆడబిడ్డల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం
- పకడ్బందీగా కల్యాణమస్తు, షాదీ తోఫా పథకం అమలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదు విడతల్లో 5,621 మందికి రూ.46.03 కోట్ల లబ్ధి
- నేడు 5వ విడత సాయాన్ని బటన్ నొక్కి విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్



కర్నూలు(అగ్రికల్చర్): వివాహం.. జీవితంలో మధురానుభూతిని ఇచ్చే ఘట్టం. ఈ తంతు పేద కుటుంబాలకు భారం అవుతోంది. ఎంత తక్కువ ఖర్చుతో వేడుక నిర్వహించాలనుకున్నా బడ్జెట్ దాటిపోతోంది. బంగారం, తాళి బొట్టు, నూతన వస్త్రాలు, భోజనాలు, మండపం.. ఇలా పెళ్లి వేడుక ముగిసే వరకూ సొమ్ము ఖర్చు చేయాల్సిన పరిస్థితి. అమ్మాయిని అత్తవారింటికి పంపి పుట్టింటి వారు అప్పుల పాలవుతున్నారు. పేదలకు ఈ పరిస్థితి రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులతోపాటు కులాంతర వివాహం చేసుకున్న వారికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. రాష్ట్రంలో 2022 అక్టోబరు1 నుంచి ఈ పథకం అమలవుతోంది. ఈ పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 5,621 మందికి ఆర్థిక తోడ్పాటు లభించింది. కర్నూలు జిల్లాలో 2,952 మంది మహిళలకు రూ.23.71 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,669 మంది యువతులకు రూ.22.31 కోట్లు చొప్పున మొత్తం రూ.46.03 కోట్ల సాయం అందింది. ఐదో విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బటన్ నొక్కి మహిళల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా జమ చేయనున్నారు. ఐదో విడతలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆడబిడ్డల బ్యాంకు ఖాతాలకు రూ. 8,37,20,000 జమ కానున్నాయి. కల్యాణమస్తు, షాదీతోఫా అమలును జిల్లా స్థాయిలో డీఆర్‌డీఏ–వైకేపీ నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి బటన్ నొక్కి నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అధికారులు, లబ్ధిదారులు వీక్షించనున్నారు. ఎంపిక చేసిన ఆడబిడ్డలతో ముఖ్యమంత్రి ముఖాముఖిగా మాట్లాడే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతో పాటు పలువురు ఎమ్మెల్యేలు కూడా పాల్గొననున్నారు.

అర్హతలు ఇవీ..

పట్టణాల్లో ఏడాదికి రూ.1.20 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షలోపు ఆదాయం కలిగి ఉన్న వారు అర్హులు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు, 1,000 చదరపు అడుగులపైన ఇల్లు కలిగిన వారు, ఫోర్ వీలర్ కలిగిన వారు, 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న వారు, 10 ఎకరాలకుపైబడి భూమి ఉన్న వారు అనర్హులవుతారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండి ఉండాలి. ఇరువురు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

ఆరిక లబ్ధి ఇలా..

ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలకు రూ.లక్ష, ఎస్సీ, ఎస్టీ అమ్మాయిలు ఇతర కులాల వారిని వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీ అమ్మాయిలకు రూ.50,000, బీసీ అమ్మాయిలు ఇతర కులాల వారిని వివాహం చేసుకుంటే రూ.75వేలు, ముస్లిం మైనార్టీ అమ్మాయిలకు రూ.లక్ష, దివ్యాంగుల అమ్మాయిలకు రూ.1.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికులకు రూ.40 వేల ప్రకారం ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 1,002 మందికి లబ్ధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కల్యాణమస్తు, షాదీ తోఫా కింద ముస్లిం మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాలు, దివ్యాంగుల కుటుంబాలకు చెందిన 1,002 మహిళలకు ఐదో విడతలో ఆర్థిక సాయం అందనుంది. కర్నూలు జిల్లాలో 494 మంది అమ్మాయిలకు అర్హత లభించింది. వీరి బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా రూ.4,03,85,000 నగదు జమ కానుంది. నంద్యాల జిల్లాలో 508 మంది యువతులకు కల్యాణమస్తు, షాదీతోఫా కింద అర్హత లభించింది. వీరి బ్యాంకు ఖాతాలకు రూ.4,33,35,000 జమకానుంది. మొత్తం అర్హులైన వారి బ్యాంకు ఖాతాలకు రూ.8,35,95,000 విడుదల చేయడానికి రంగం సిద్ధం అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బటన్ నొక్కిన వెంటనే అమ్మాయిల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుంది.

ఐదు విడతల్లో లబ్ధిపొందిన వారి వివరాలు

కర్నూలు జిల్లాలో.. లబ్ధిదారులు	ఆర్థికసాయం	విడత	నంద్యాల జిల్లాలో.. లబ్ధిదారులు	ఆర్థికసాయం
271	2,31,40,000	1వ విడత	273	2,34,20,000
574	4,26,35,000	2వ విడత	419	3,21,85,000
1,076	8,61,05,000	3వ విడత	982	8,35,95,000
537	4,48,70,000	4వ విడత	516	4,33,35,000
494	4,03,85,000	5వ విడత	479	4,06,35,000
2,952	23,71,35,000	మొత్తం	2,669	22,31,70,000

ఐదో విడతలో లబ్ధిదారుల వివరాలు నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	లబ్ధిదారులు
ఆలూరు	51
కోడుమూరు	47
కర్నూలు	143
మంత్రాలయం	37
పత్తికొండ	66
ఎమ్మిగనూరు	61
ఆళ్లగడ్డ	71
బనగానపల్లె	92
డోన్	81
నందికొట్కూరు	80
నంద్యాల	71
పాణ్యం	51
శ్రీశైలం	59

రూ.లక్ష లబ్ధి పొందాను



మేము గత ఏడాది నాలుగో విడతలో వైఎస్సార్ కల్యాణమస్తుకు దరఖాస్తు చేసుకోగా రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం మా ఖాతాలో జమ చేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. వైఎస్సార్ కల్యాణమస్తు పథకంతో నిరుపేద ఆడపిల్లల తల్లిదండ్రులకు పెళ్లి భారం తగ్గిపోతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటోంది. – నాగరమేష్, జయమ్మ దంపతులు, నూనెపల్లె, నంద్యాల

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



కల్యాణమస్తు, షాదీతోఫా కింద లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగింది. అర్హత కలిగిన వారందరికీ న్యాయం చేశాం. సిక్స్‌స్టెప్ వాల్యుయేషన్‌ను పరిగణనలోకి తీసుకొని అర్హులను ఎంపిక చేశాం. కర్నూలు జిల్లాలో 494 మంది అమ్మాయిలకు అర్హత లభించింది.ఎస్టీల్లో 9, ఎస్సీల్లో 155, బీసీల్లో 208, మైనార్టీల్లో116, ఓసీల్లో 6 మంది మహిళలకు ఆర్థిక తోడ్పాటు లభిస్తోంది.

– సలీమ్‌బాషా, పీడీ, డీఆర్‌డీఏ–వైకేపీ, కర్నూలు

సంప్రదాయబద్ధంగా పుష్పాధివాసం



పుష్పాధివాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జగద్గురు పీఠాధిపతి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా సోమవారం నాల్గవరోజు ఉభయ దేవాలయాల్లో విశేష పూజలు, కుంభాభిషేక క్రతువులు నిర్వహించారు. ఈనెల 21వ తేదీన శివాజీ గోపుర కలశ ప్రతిష్టాపన స్వామివారి గర్భాలయ ఆలయంలోని పలు ఉపాలయాల విమాన గోపురాలకు కుంబాభిషేకం నిర్వహిస్తారు. కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో సోమవారం ఉదయం నుంచి గోపూజ, మండపు పూజలు, వేదపారాయణాలు, రుద్ర, చండీ పారాయణాలు హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. సాయంత్రం పుష్పాధివాసం కార్యక్రమం నిర్వహించారు. పుష్పాధివాసం కార్యక్రమంలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి పాల్గొని కలశాలకు పుష్పాలను సమర్పించారు. అనంతరం హారతి కార్యక్రమంలో పీఠాధిపతి పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందనలో జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ పద్మజ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలన్నారు. ఏ ఒక్క దరఖాస్తు రీఓపెన్ కాకుండా చూసుకోవాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించలేని సమస్యలకు సరైన కారణాలతో ఎండార్స్ ఇవ్వాలన్నారు. స్పందన కార్యక్రమంలో 160 మంది అర్జీదారులు వినతులు అందించారు.

వినతులలో కొన్ని..

- 2022–23లో లా పూర్తి చేసి ప్రస్తుతం ప్రాక్టీస్ చేస్తున్నానని 'జగనన్న లా నేస్తం'కు దరఖాస్తు చేయగా మున్సిపల్ అధికారులు అప్రూవల్ చేసినా ఇంతవరకు జాబితాలో పేరు రాలేదని, వెంటనే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని నంద్యాల పట్టణంలోని దేవనగర్‌కు చెందిన ప్రియాంక వినతి పత్రం అందజేశారు.
- తనకు తల్లిదండ్రులు లేరని, భర్త కూడా వికలాంగుడని ఇద్దరు ఆడపిల్లల సంతానంతో కుటుంబ పోషణ చాలా కష్టమైందని తాను డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ పూర్తి చేశానని తనకు శిశు సంక్షేమ శాఖలో పారామెడికల్ పర్సనల్ పోస్ట్ ఇప్పించాలని కోరుతూ గోస్పాడు మండలం కానాలపల్లె గ్రామానికి చెందిన ప్రవీణ వినతి పత్రం అందజేశారు.
- 2002లో సర్వే నంబర్ 44లో 3.63 ఎకరాలు డీ – పట్టా పొందానని, ఇంతవరకు ఆన్‌లైన్‌లో పట్టాదారు పాసుపుస్తకాలు రాలేదని వెంటనే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మిడుతూరు మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన శ్రీదేవి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

- వచ్చే విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపు
- ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ల ఆహ్వానం
- మార్చి 14వ తేదీన దరఖాస్తుకు తుది గడువు

నంద్యాల(న్యూటౌన్): విద్యా హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేటు పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారనుంది. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేటు పాఠశాలలు ఈ మేరకు వారికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. పాఠశాలల్లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన విద్యార్థుల జాబితా విద్యాశాఖ విడుదల చేసింది. ఎంపికైన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలు ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్ఐవీ బాధితుల పిల్లలు అర్హులు ఈ పథకానికి అర్హులు. ఉచిత ప్రవేశాలకు నిరాకరించిన యాజమాన్యాలపై విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది. 2023–24లో నంద్యాల జిల్లాలో 235 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఆయా మండలాల్లోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందారు.

2024–25 విద్యా సంవత్సరానికి..

విద్యా హక్కు చట్టం–2009 ప్రకారం ఏటా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇచ్చే అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ఏటా అర్హులైన పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్ పొంది చదువుకునే అవకాశం కల్పించేలా నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలవుతున్న ప్రైవేటు పాఠశాల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది.

షెడ్యూల్ ఇలా..

- అభ్యర్థులు http://cse.ap.gov.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు విద్యార్థుల వివరాల నమోదుకు అవకాశం కల్పించారు.
- మార్చి 20 నుంచి 22 వరకు విద్యార్థుల దరఖాస్తు అర్హతపై చెక్ చేసుకోవచ్చు.
- ఏప్రిల్ 1న లాటరీ పద్ధతి ద్వారా మొదటి విడత జాబితా విడుదల చేస్తారు
- ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ వరకు ఆయా పాఠశాలల్లో ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్ ప్రక్రియ జరుగుతుంది.
- ఏప్రిల్ 15న లాటరీ పద్ధతి ద్వారా రెండవ జాబితా విడుదల
- ఏప్రిల్ 16 నుంచి 23 వరకు ఆయా పాఠశాలల్లో ఎంపికైన విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన వారు దరఖాస్తు చేసుకు ని సద్వినియోగం చేసు కోవాలి. అర్హులైన విద్యార్థులకు లాటరీ విధానం ద్వారా సీట్లు కేటాయించడం జరుగుతుంది. మరింత సమాచారం కోసం 18004258599 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలి.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

సాంకేతిక విద్యలో మేటి

- రూ.296.12 కోట్లతో ట్రిపుల్‌ఐటీడీఎం క్యాంపస్ నిర్మాణం
- క్యాంపస్‌లో నాలుగు యూజీ, 6 పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు
- నేడు వర్చువల్‌గా జాతికి అంకితం చేయనున్న ప్రధాన మంత్రి మోదీ



ట్రిపుల్ ఐటీడీఎం

కర్నూలు సిటీ: సాంకేతిక విద్యను అందించడంలో కర్నూలులో ఏర్పాటు చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్(ట్రిపుల్‌ఐటీ డీఎం) మేటి సంస్థగా నిలిచింది. అన్ని రకాల సదుపాయాలతో తీర్చిదిద్దిన ఈ సంస్థను మంగళవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా జాతికి అంకితం చేయనున్నారు. ఇదే రోజు దేశంలో సుమారుగా 32 ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ, ట్రిపుల్‌ఐటీడీఎం , ఐఐఎస్‌ఈఆర్ సంస్థలను జాతికి అంకితం చేయనున్నారు. వీటిలో కర్నూలు ట్రిపుల్‌ఐటీ డీఎం, తిరుపతి ఐఐటీ, శ్రీసిటీ ఐఐఐటీ, తిరుపతి ఐఐఎస్‌ఈఆర్ (ఇండియన్ ఇన్‌స్టిటూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసెర్చ్), వైజాగ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లు ఉన్నాయి. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ట్రిపుల్‌ఐటీ డీఎంకు పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మొదటగా ఈ సంస్థను కాంచీపురం(తమిళనాడు)లో 2015 ఆగస్టులో ప్రారంభించారు. శాశ్వత క్యాంపస్‌తో కర్నూలులో 2018 జూలై నుంచి ఈ సంస్థ విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. క్యాంపస్‌లో నాలుగు యూజీ, 6 పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీటెక్ సీట్లు మొదట 75 ఉండగా నేడు 271కి పెరిగాయి. ఇక్కడ బీటెక్ పూర్తి చేసిన వారు ఏడాదికి రూ.7.5 లక్షల నుంచి గరిష్టంగా రూ.30 లక్షల వేతనంతో ఉద్యోగాలు పొందుతున్నారు. ఎంటెక్‌లో 100 శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉంటున్నాయి. రూ.11 లక్షల వార్షిక వేతనంతో ఎంటెక్ విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారు. రెండేళ్ల ఎంటెక్ కోర్సులో ఒకేడాది ఇక్కడ, నార్వేలో మరో సంవత్సరం విద్యాభ్యాసానికి సంస్థ నార్వే ఆగ్డర్ యూనివర్సిటీలో ఒప్పందం చేసుకోగా, ప్రస్తుతం ఆరుగురు విద్యార్థులు నార్వేలో చదువుతున్నారు. క్యాంపస్‌లో 5జీ ల్యాబ్ ఏర్పాటు చేశారు.

అన్ని సౌకర్యాలు

కర్నూలు నగర శివారులోని శివారులోని జగన్నాథగట్టుపై 151.51 ఎకరాల్లో అన్ని సౌకర్యాలతో ఈ సంస్థ ఏర్పాటైంది. గట్టులో లోయలు, ఎత్తు పల్లాలు ఉన్నప్పటికీ ఆర్కిటెక్చర్ నైపుణ్యంతో కట్టిన భవనాలు క్యాంపస్‌కు సరికొత్త అందాలను ఇచ్చాయి. రూ.296.12 కోట్లతో క్యాంపస్‌లో మొత్తం 16 తరగతి భవనాలు, 22 ప్రయోగశాలలు, లైబ్రరీ, మూడు సెమినార్ హాల్స్, ఒకటి మల్టిపర్పస్ హాల్, కంప్యూటర్ ల్యాబ్, రెండు మెస్ బ్లాక్‌లు, డైరెక్టర్ బంగ్లా, 20 ఫ్యాకల్టీ క్వార్టర్స్, రెండు సబ్ స్టేషన్లు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లతో పాటు 1,260 మంది విద్యార్థులు ఉండేలా భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి.



క్యాంపస్‌లోని భవనం

అత్యుత్తమైన ఫ్యాకల్టీతో బోధన



క్యాంపస్ చుట్టూ రక్షణ గోడను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. అలాగే తాగునీటి సమస్యను పరిష్కరిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి 36 బహుళ జాతి కంపెనీలతో క్యాంపస్ సెలక్షన్లు జరిగాయి. 2018–22 బ్యాచ్‌కి చెందిన విద్యార్థి రూ.1.36 కోట్ల వార్షిక వేతనంతో ఉద్యోగం పొందారు. విద్యార్థులకు అత్యుత్తమమైన ఫ్యాకల్టీతో పరిశోధనాత్మకమైన విద్యను అందిస్తున్నాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ సంస్థను మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ పాల్గొననున్నారు.

– డాక్టర్ ఎల్ఎస్‌వీ సోమయాజులు, ట్రిపుల్ ఐటీడీఎం, డైరెక్టర్

క్లుప్తంగా

అటవీ మార్గంలో వృద్ధుడి మృతి

● మృతుడు పల్నాడు జిల్లా వాసి


నూతలపాటి సాంబయ్య (ఫైల్)

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని శ్రీశైలం ముఖద్వారం దాటిన తరువాత శిఖరేశ్వరం వెళ్లే అటవీమార్గంలో ఓ వృద్ధుడు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు ఆరా తీశారు. మృతదేహం గుర్తు పట్టని విధంగా మారిపోయింది. పక్కనే ఆధార్‌కార్డు లభించడంతో మృతుడు పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం రావిపాడు గ్రామానికి చెందిన నూతలపాటి సాంబయ్య (60)గా గుర్తించినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. వెంటనే మృతుడు కుమారుడికి సమాచారం ఇవ్వడంతో శ్రీశైలం చేరుకున్నారు. నూతలపాటి సాంబయ్యకు ఇప్పటికే మూడు బైపాస్ సర్జరీలు జరిగాయి. ఈనెల 10వ తేదీన ఒక్కడే శ్రీశైలం వచ్చిన సాంబయ్య మల్లన్న దర్శనం అనంతరం శిఖరం దర్శనం కోసం కాలినడక అటవీ మార్గంలో బయలుదేరాడు. కాగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, అందరికీ వివాహాలు అయ్యాయని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు.

నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత వసతి

కర్నూలు(అర్బన్): జిల్లా నుంచి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు నోపా భవనంలో ఉచిత వసతి ఏర్పాటు చేసినట్లు నోపా అధ్యక్షులు డాక్టర్ నవీన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో అద్దెలు చెల్లించలేక, గ్రామీణ ప్రాంతాల్లో సరైన వసతులు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నాయీ బ్రాహ్మణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాస్టల్‌లో ప్రవేశం పొందాలనుకునే వారు హాస్టల్ మేనేజర్ రామాంజనేయులును 9885771456 సంప్రదించాలని పేర్కొన్నారు.

పేదలకు ఎంతో మేలు చేశారు



నేను ప్రభుత్వ పాఠశాలలో వంట నిర్వాహకురాలిగా పని చేస్తున్నా. నాకు ప్రతి నెలా రూ.3వేల వితంతు పింఛన్ వస్తుంది. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారిని చదివించాలంటే రూ. వేలల్లో ఖర్చు వస్తుంది. తల్లిదండ్రుల కష్టం తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15,000 ఇచ్చి ఆదుకుంటున్నారు. ప్రభుత్వం అందించిన డబ్బును పిల్లల చదువుకు ఖర్చు చేస్తున్నా. పిల్లలకు యూనిఫాం, నోటుపుస్తకాలు, టై, బెల్టు, షూ, బ్యాగు.. ఇలా అన్నీ గవర్నమెంటే ఉచితంగా ఇస్తోంది. స్కూళ్లకు వచ్చిన విద్యార్థులకు ఉదయం రాగి జావతో పాటు మధ్యాహ్నం వేళలో మంచి ఆహారంతో పాటు గుడ్లు, చిక్కీలను అందిస్తోంది. ఇంతకంటే ఏం కావాలి? ఇది చాలా మంచి ప్రభుత్వం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు ఎంతో మేలు చేశారు.
– ఉమాదేవి, ఆర్‌ఆర్ లేబర్ కాలనీ, ఆదోని

మా బతుకులు బాగుపడ్డాయి



మాది పేద కుటుంబం. నేను 18 ఏళ్లగా టైలరింగ్ చేస్తున్నా. గతంలో మేం చాలా ఇబ్బందులు పడ్డాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మా బతుకులు బాగుపడ్డాయి. మా అమ్మ మారీన్ బీకి రూ.3వేలు పింఛన్ వస్తోంది. మాకు ఇంటి పట్టా అందించి రిజిస్ట్రేషన్ కూడా ఉచితంగా చేశారు. టైలర్ కావడంతో జగనన్న చేదోడు పథకం కింద నాకు ఇప్పటి వరకు రూ.40 వేలు అందాయి. నా పెద్ద కుమారుడు ఆఫ్రీద్ ఎమ్మిగనూరులోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా రూ.1.55 లక్షల లబ్ధి పొందాడు. రెండో కుమారుడు ఆదిల్ మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అమ్మ ఒడి పథకం ద్వారా మూడేళ్లకు రూ.45 వేలు లబ్ధిపొందాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో మా జీవితంలో మార్పు వచ్చింది. – వలి, నందవరం

కర్నూలు జిల్లాలో సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధి

సంక్షేమ పథకం	లబ్ధిదారుల సంఖ్య	కేటాయించిన మొత్తంరూ.కోట్లలో
వైఎస్ఆర్ ఆసరా	1,73,227	2,924
జగనన్న అమ్మ ఒడి	10,33,191	1,549
జగనన్న చేదోడు	49,814	49.81
ఉచిత పంటల బీమా	3,25,730	618.97
వైఎస్ఆర్ ఈబీసీనేస్తం	13,245	19.86
వైఎస్ఆర్ ఇన్‌పుట్ సబ్సిడీ	18,241	17.80
జగనన్నతోడు	72,524	1,105
జగనన్న వసతి దీవెన	1,71,671	157.13
జగనన్న విద్యా దీవెన	1,76,083	310.68
వైఎస్ఆర్ కాపునేస్తం	5,337	8.00
వైఎస్ఆర్ నేతన్న నేస్తం	3,263	30.11
వైఎస్ఆర్ రైతు భరోసా	2,96,739	1,793.53
వైఎస్ఆర్ సున్నా వడ్డీ (పంట రుణాలు)	30,671	140.37
వైఎస్ఆర్ వాహన మిత్ర	60,506	60.50
వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ	1,91,964	403.50
వైఎస్ఆర్ చేయూత	1,24,045	666.50
వైఎస్ఆర్ పెన్షన్ కానుక	2,45,320	3740.90
వైఎస్ఆర్‌బీమా	3,286	26.40
మొత్తం	29,949,917	10,136.85

● సంక్షేమ పథకాల అమలుతో ప్రజల జీవన విధానంలో మార్పులు
● జిల్లాలో 30 లక్ష మందికి రూ.10,136 కోట్ల లబ్ధి
● 57 నెలల పాటు నిర్విరామంగా ప్రభుత్వ పథకాల అమలు
● అర్హతను బట్టి ఒక్కో వ్యక్తికి రెండు, మూడు పథకాలు
● పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక
● మహిళల జీవనోపాధికి 'చేయూత'నిచ్చిన ప్రభుత్వం

పత్తికొండలో వైఎస్ఆర్ రైతు భరోసా నిధులను బటన్ నొక్కి విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)



జీవన వికాసం

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదోడి ముఖంలో చిరునవ్వులు చిందాయి. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో జీవన విధానంలో భారీ మార్పులు వచ్చాయి. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాల ద్వారా ఎంతో మంది మహిళలు స్వయం ఉపాధికి మార్గం వేసుకున్నారు. అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలకు వైఎస్ఆర్ పెన్షన్‌కానుక ద్వారా జీవితంపై భరోసా పెంచుకున్నారు. చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఆర్థికంగా తోడుగా నిలిచారు. వైఎస్ఆర్ రైతు భరోసా, సున్నా వడ్డీ పంటల బీమాతో రైతన్నకు ధీమాను కల్పించారు. ఆరోగ్యశ్రీతో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందే ఏర్పాటు చేశారు. అనుకోకుండా జరిగే ప్రమాదాల్లో కుటుంబ పెద్దలను పోగొట్టుకునే అభాగ్యులకు వైఎస్ఆర్ బీమా అండగా నిలుస్తోంది. అమ్మ ఒడి, జనన్న విద్యాకానుక, వసతి, విద్యా దీవెనలతో విద్యార్థులు భవిష్యత్తుకు భరోసా లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన 57 నెలల పాలనలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు అర్హతే ప్రమాణంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో వారి జీవితంలో పెనుమార్పులు సంభవించాయి. పేదరికం నుంచి ఎంతో మంది బయట పడ్డారు.

124 సార్లు బటన్ నొక్కి

2019 ఎన్నికల్లో ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎంతో నమ్మకం ఉంచి వైఎస్ఆర్‌సీపీకి అఖండ మెజార్టీ ఇచ్చారు. గతంలో ఏ నాయకుడికి లేనట్లుగా ఏకంగా 51 శాతం మంది మద్దతు తెలిపారు. ఇందుకోసం ఫ్యాన్ గుర్తుపై ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల గెలుపుకోసం బటన్ నొక్కారు. అందుకు ఆయన బదులుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 124 సార్లు బటన్ నొక్కి ప్రజల రుణం తీర్చుకున్నారు. దాదాపు 18 సంక్షేమ పథకాలను ఐదేళ్లపాటు అమలు చేశారు. అందులో భాగంగా జిల్లాలో 30 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాల్లో 10,136 కోట్ల నగదు నేరుగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా జమైంది. ఆ నగదుతో ప్రజలు తమ జీవన విధానం, గమనాన్ని మార్చుకున్నారు.

జిల్లాలో రూ.10,136 కోట్ల లబ్ధి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల కష్టాలను కళ్లారా చూసి వారిని ఆదుకోవడానికి అనేక హామీలు ఇచ్చారు. ఆ హామీలనే మేనిఫెస్టోగా మలచి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేశారు. దాదాపు 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుంది. వివిధ సంక్షేమ పథకాల ద్వారా జిల్లాలోని ప్రజలకు తన 57 నెలల పాలనలో 10,136 కోట్ల లబ్ధి చేకూర్చారు.

అర్హతే ప్రామాణికం

సీఎం వైఎస్ జగన్ తన పాలనలో అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేశారు. పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న నిబంధనలు మేరకు అర్హత సాధిస్తే ప్రతిపక్ష పార్టీల వారికైనా సంక్షేమపథకాలు అందాయి. అంతేకాక ఒక్క లబ్ధిదారుడికి ఒక్కటే సంక్షేమ పథకం అందేలా గతంలోఉండేది. ఆ నిబంధనను కూడా సరళించి అర్హత ఉంటే ఎన్ని సంక్షేమ పథకాలపై ఎంపికయ్యేలా చర్యలు తీసుకున్నారు. కర్నూలు జిల్లా జనాభా 24,51,232 లక్షలు అయితే 30 లక్షల మందికి సంక్షేమ పథకాలు అందాయి.

స్వయం ఉపాధికి బాటలు



సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల సాయంతో సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంక్ ఖాతాలకే నగదు జమ అవుతోంది. ప్రభుత్వ సాయంతో చాలా మంది మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నారు. పిల్లలను ఉన్నతంగా చదివించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇచ్చింది. నాడు- నేడుతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది.
– ఇందిరశాంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉన్నత విద్య

పేదలకు అండగా నిలిచారు



సంక్షేమ పథకాలు ప్రజల స్థితి గతిని మార్చాయి. అప్పుల బాధ నుంచి విముక్తి కలిగి స్వయం ఉపాధికి బాటలు వేశాయి. పేదలకు వివిధ రకాల పథకాలతో సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. చిరువ్యాపారులు, మహిళలు, డ్రైవర్లు, రజకులు, టైలర్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది ఉన్నారు. వీరంతా ఇప్పుడు పేదరికం నుంచి బయటపడ్డారు. పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు.
– కె.శివనాగిరెడ్డి, జనవిజ్ఞాన వేదిక, నాయకులు

అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


పెద్దదస్తగిరి (ఫైల్)

కోవెలకుంట్ల: సొదరదిన్నె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పులబాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ వరప్రసాద్ అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పెద్దదస్తగిరి(43) అనే వ్యక్తి 5.20 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని రెండేళ్ల నుంచి మిరప, పొగాకు పంటలు సాగు చేస్తున్నాడు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 5 లక్షల వరకు అప్పులు చేశాడు. వాతావరణం అనుకూలించక పోవడంతో దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి. తీసుకున్న అప్పు చెల్లించాలని ఒత్తిడి అధికం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి క్రిమి సంహారక గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువులు ఆసుపత్రికి తరలించగా కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైనవైద్యం కోసం నంద్యాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుని భార్య దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం


● సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న సెబ్ సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్, చిత్రంలో సెబ్ పోలీసులు

కర్నూలు/ఎమ్మిగనూరురూరల్: మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో పట్టుబడిన కర్ణాటక మద్యం, ట్రాక్టర్‌ను మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం కాచాపురం గ్రామానికి చెందిన బోయ ఈరన్న అనే వ్యక్తి మూడు నెలలుగా కర్ణాటక మద్యాన్ని తెచ్చి ఆదోని, కోసిగి, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమచారాం వచ్చిందన్నారు. సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్‌ఐ సత్యనారాయణలను రెండు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తుండగా కాచాపురం రైల్వే బ్రిడ్జి కింద ట్రాక్టర్‌లో 20 సంచుల్లో 100 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడిందన్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 4 లక్షలు ఉంటుందన్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా గిలకసూగుర్ చెందిన దుర్గా వైన్స్ నుంచి ఈ మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో గిలకసూగుర్ దుర్గా వైన్స్ మేనేజర్ కృష్ణ, ఆదోనికి చెందిన రాధమ్మ, కోసిగికి చెందిన జొల్లయ్య, లక్ష్మన్నలను నిందితులుగా చేర్చి విచారిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మద్యం అక్రమ రవాణా జరిగితే 8008828467 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. భారీగా కర్ణాటక మద్యం పట్టుకున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి, ఎస్‌ఐ సత్యానారాయణకు కమిషనర్ ప్రకటించిన అవార్డులను అందచేస్తున్నామన్నారు. ఇంటలిజెన్స్ సీఐ రఫీ, ఎస్‌ఐ రాజశేఖర్, పీసీలు నరసింహులు, విజయ్, సోమశేఖర్‌లు, సెబ్ హెచ్‌సీ గోపాల్, పీసీలు లక్ష్మన్న, నరసింహారెడ్డి, భరత్, ఇందుమతిలను అభినందిస్తున్నామన్నారు.

బాలుడి కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపిస్తున్న సీఐ రమేష్‌బాబు

ఆళ్లగడ్డ: అప్పు తిరిగి ఇవ్వలేదని కోపంతో ఓ వ్యక్తికి చెందిన నాలుగేళ్ల కుమారుడిని కిడ్నాప్ చేసి హత్యకు యత్నించిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలో నాలుగు రోజుల క్రితం సంచలనం సృష్టించిన బాలుడి కిడ్నాప్ కేసు మిస్టరీని పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బొరుగులబట్టి వీధికి చెందిన వెంకటలక్ష్మి వడ్డీ వ్యాపారం చేస్తోంది. ఈ క్రమంలో అదే కాలనీలో వరుసకు సోదరుడు అయ్యే భూపాల్‌కు కొంత మొత్తం అప్పుగా ఇచ్చింది. అధిక వడ్డీ కావడంతో మొత్తం పెరిగి సుమారు రూ. 15 లక్షలకు చేరింది. దీంతో అప్పు తీర్చాలని ఒత్తిడి పెంచినప్పటికీ భూపాల్ సరైన సమాధానం ఇవ్వలేదు. దీంతో ఎలాగైనా అతనిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆయన ఒక్కనాగొక్క కొడుకు చక్రిని తుదముట్టించాలని వెంకటలక్ష్మి కుట్ర పన్నింది. దీంతో ఈ నెల 15వ తేదీ ఉదయం చక్రి (4వ తరగతి విద్యార్థి) పాఠశాలకు వెళ్తుండగా సత్రం వీధి సమీపంలో వెంకటలక్ష్మి, ఆమెతో సహజీవనం చేస్తున్న సుధాకర్ సహాయంతో కారులో ఎక్కించుకున్నారు. వీరిద్దరూ ఇంటి సమీపంలో ఉండటతో బాలుడు చక్రి వారిని నమ్మి కారులో వెళ్లాడు. కాగా కారు మైదుకూరు నుంచి బ్రహ్మంగారి మఠం వెళ్లే దారిలో అడవిలోకి తీసుకెళ్లారు. అక్కడ బాలుడి దుస్తులు ఊడదీసి విక్షణారహితంగా కొట్టారు. దీంతో స్పృహ కోల్పోయిన బాలుడిని కొండపై నుంచి లోయలోకి తోసేశారు. ఇక చనిపోయాడని భావించిన నిందితులు ఏమి ఎరుగనట్లు ఆళ్లగడ్డకు చేరుకున్నారు. అయితే అదృష్ట వశాత్తు కొంత సమయానికి మెలకువ వచ్చిన బాలుడు సమీపంలో రోడ్డుపైకి చేరుకుని అక్కడ పొలం పనులు చేసుకుంటున్న వారి వద్దకు చేరుకున్నాడు. జరిగిన విషయం బాలుడు వారితో చెప్పడంతో వెంటనే మైదుకూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు విచారించి బాలుడిని తండ్రికి చెంతకు చేర్చారు. ఈ ఘటనపై ఆళ్లగడ్డ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సోమవారం నిందితులు వెంకటలక్ష్మి, సుధాకర్‌ను అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

చిలుకలూరులో అహోబిలేశుడు


ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం


రుద్రవరం: అహోబిలేశుని పార్వేట పల్లకీ సోమవారం చిలుకలూరుకు చేరింది. గ్రామస్తులు, అధికారులు పల్లకీకి ఘన స్వాగతం పలికారు. గ్రామ తెలుపులపై కొలువైన జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామిని భక్తులు దర్శించుకున్నారు. చిలుకలూరు నుంచి పల్లకీ తిప్పారెడ్డిపల్లెకు బయలుదేరింది.

అవుట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలోని ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో వాచ్‌మెన్, ఆఫీసు సబార్డినేట్, శానిటరీ వర్కర్ ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఆర్.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జిల్లావాసులై ఉండాలన్నారు. వివరాలు, దరఖాస్తును వెబ్‌సైట్ www.knl.ap.gov.inలో పొందుపరిచామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 20వ తేది నుంచి 24వ తేది సాయంత్రం 5 గంటల్లోపు బిర్లా గేట్ ఎదురుగా ఉన్న జిల్లా రహదారులు, భవనాల శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. వాచ్‌మెన్ 5, ఆఫీసు సబార్డినేట్ 4, శానిటరీ వర్కర్స్ 5 ఖాళీలు ఉన్నాయన్నారు.

హొళగుంద ఎద్దుల జయకేతనం

హొళగుంద: సిద్దేశ్వరస్వామి లంకాదహనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం హొళగుందలో నిర్వహించిన రాతిదూలం పోటీల్లో హొళగుంద ఎద్దులు జయకేతనం ఎగురవేశాయి. ఆలయ ధర్మకర్త శివన్నగౌడ్ పోటీలను ప్రారంభించగా.. నాలుగు జతల ఎద్దులు పాల్గొన్నాయి. వీటిలో హొళగుందకు చెందిన ఆంజనేయ ఎద్దులు 20 క్వింటాళ్ల రాతి దూలాన్ని ఆలయం నుంచి తేరు వరకు దాదాపు 300 అడుగుల వరకు లాగి భళా అనిపించాయి. రెండో స్థానంలో పొంగీ మల్లయ్యకు చెందిన ఎద్దులు నిలిచాయి. గెలిచిన ఎద్దులను సాయంత్రం గ్రామంలో ఊరేగించారు. ఇదిలా ఉండగా.. రాతి దూలం లాగే సమయంలో పోటీలో పాల్గొన్న వారి చూసి ఎద్దులు బెదిరాయి. జనాల మీద వెళ్లడంతో ఎడాదిన్నర దాటిన కర్ణాటక రాష్ట్రం ఉత్తనూరుకు చెందిన చిన్నారి తలకు గాయమైంది. ఆ చిన్నారికి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించారు.


రాతి దూలాన్ని లాగుతున్న ఎద్దులు



ఆలయ భూములను పరిరక్షించండి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

● రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

నంద్యాల(వ్యవసాయం): రాయలసీమలోని దేవాలయాలు, మఠాలు, చౌల్ట్రీలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులపై ఉందని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక పట్టణ శివారులోని భీమేశ్వరస్వామి దేవస్థానంలో రాయలసీమ జిల్లాల దేవదాయ శాఖ అధికారులు, కార్యనిర్వాహణ అధికారులు, తనిఖీ అధికారులు, అర్చక సమాఖ్య ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ పరిధిలో వార్షిక ఆదాయం కేవలం రూ.5 లక్షలు లోపు ఉన్న ఆలయాలను ఇకపై స్వతంత్రంగా వ్యవహరించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. అర్చకుల సంక్షేమం కోసం పదవీ విరమణ వయస్సు పెంపు, చిన్న ఆలయాల స్వేచ్ఛా, వంశపారంపర్య హక్కు పునరుద్ధరణ, అర్చకుల వేతనాలు పెంచడం తదితర నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో చిన్న ఆలయాలు కూడా అభివృద్ధిలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. పర్యవేక్షణ అధికారులు నిత్యం తనిఖీలు చేసి దేవాలయ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలన్నారు. ఆలయాలకు సంబంధించిన టెండర్ల వసూళ్లు సక్రమంగా సకాలంలో వసూలు చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వంగా వ్యవహరిస్తున్న అనంతపురం జిల్లా కల్యాణదుర్గంకు చెందిన ఈఓ దేవదాసు సస్పెండ్ చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ అర్చక వెల్ఫేర్ బోర్డు మెంబరు శ్రీనివాస ఆచార్యులు మాట్లాడుతూ అర్చకులకు 43(10) రిజిస్ట్రేషన్‌ను నమోదు చేయాలని, రూ.5లక్షల్లోపు ఆదాయం ఉన్న దేవాలయాలు అర్చకుల పౌరహిత్యం బాధ్యతలను అప్పగించాలన్నారు. సమావేశంలో కర్నూలు డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, సుధాకర్‌రెడ్డి, ఆర్‌జేసీ సత్యనారాయణమూర్తి, నరసింహులు, పుల్లయ్య, నంద్యాల, కర్నూలు, అనంతపురం, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించిన దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.